క్లుప్తంగా

కరాటే విజేతలకు అభినందన



పాయకాపురం(విజయవాడరూరల్): చిలకలూరిపేటలో ఆదివారం జరిగిన శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఆల్ ఇండియా ఓపెన్ కరాటే– దో చాంపియన్‌షిప్ – 2025 పోటీల్లో పాయకాపురం క్యోఇకు కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వెయ్యి మంది పాల్గొన్న ఈ నేషనల్ ఓపెన్ కరాటే టోర్నమెంట్‌కు అకాడమీకి చెందిన 9 మంది విద్యార్థులు పాల్గొని వరుసగా ఫస్ట్ ప్లేస్‌లో నలుగురు, సెకండ్ ప్లేస్‌లో ముగ్గురు, థర్డ్ ప్లేస్‌లో ఇద్దరు గెలుపొంది ట్రోఫీలను సాధించినట్లు చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బల్లం కిశోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలను అభినందించారు. కరాటే స్కూల్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బల్లం కిశోర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఏపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిశెట్టి రమేష్ కుమార్, డాక్టర్ మద్దుల దినేష్ కుమార్ గుప్తా, షేక్ మస్తాన్ వలి, సీహెచ్.మురళీ, డి.రామారావు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

నేత్రపర్వంగా సాంస్కృతిక కార్యక్రమాలు



విజయవాడకల్చరల్: దృశ్యవేదిక నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నాట్యాచార్యుడు సంగీత కళాశాల అధ్యాపకుడు సీహెచ్ అజయ్‌కుమార్ బృందం పలు నృత్యాలను ప్రదర్శించారు. రెండో కార్యక్రమంలో అభ్యుదయ ఆర్ట్స్ విజయవాడ చెందిన నటీనటులు అంగికం భువనం యశ్య సాంఘిక నాటికను ప్రదర్శించారు. రచన అనంత హృదయరాజ్, దర్శకత్వం రమేష్ వెంపటి వహించారు. కార్యక్రమంలో విద్యావేత్త దేవినేని కిషోర్‌బాబు, దృశ్యవేదిక నిర్వాహకులు హెచ్‌వీఆర్‌ఎస్ ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 13, 14 తేదీల్లో ఏపీసీసీబీఈఏ డైమండ్ జూబ్లీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏపీసీసీబీఈఏ) 59 వసంతాలు పూర్తి చేసుకుని 60 వసంతంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో ఏప్రిల్ 13, 14 తేదీలలో విజయవాడ నగరంలో డైమండ్ జూబ్లీ సమావేశాలు నిర్వహించాలని అసోసియేషన్ నిర్ణయించింది. ఆదివారం గవర్నర్‌పేటలోని సంఘ కార్యాలయంలో అసోసియేషన్ ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఆల్ ఇండియా బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డైమండ్ జూబ్లీ సమావేశాల నిర్వహణపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ సహకార వ్యవస్థలో గణనీయమైన మార్పులు రావడంలో ఏపీసీసీబీఈఏ కీలక పాత్ర పోషించిందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ అసోసియేషన్ డైమండ్ జూబ్లీ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. డైమండ్ జూబ్లీ సమావేశాలకు సంబంధించి రిసెప్షన్ కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్ గా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, అధ్యక్షులుగా ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి బి.ఎస్. రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా కేవీఎస్ రవికుమార్‌ను నియమించారు.

కాళీమాత ఆలయంలో హోమం

లబ్బీపేట(విజయవాడతూర్పు): పండిట్ నెహ్రూ బస్టేషన్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో ఆదివారం మేధా దక్షిణామూర్తి, సరస్వతి అమ్మవార్ల హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హోమంలో ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షలు రాయనున్న 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారందరికీ ఉచితంగా పెన్నులు, కంకణాలు, ప్రసాదం, అమ్మవారి ఫొటోలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పుల్లయ్య, జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు విజయకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన సుందరీకరణ పనులు



దేవీనగర్‌లో అసంపూర్తిగా వదిలేసిన ప్రహరీ పనులు



పిచ్చి మొక్కలు, చెత్తచెదారం

- దేవీనగర్‌లో బుడమేరు వెంట ప్రహరీ నగం కట్టి వదిలేసిన వైనం
- పిచ్చిమొక్కలు, చెత్తచెదారంతో చిట్టడవిని తలపిస్తున్న దుస్థితి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్‌లో బుడమేరు పక్క నివాసాలను సుందరీకరణ పేరిట తొలగించారు. ప్రత్యామ్నాయంగా వాంబేకాలనీలో నివాసాలు సైతం కేటాయించారు. నివాసాలు తొలగించి ఎనిమిదేళ్లు గడిచినా... ఇంత వరకు కనీసం ఒక మొక్కను నాటిన పాపాన పోలేదు.. గత ప్రభుత్వం మరోమారు ఆక్రమణలు జరగకుండా చూసేందుకుగానూ ఇక్కడ ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. ఇంతలో ఎన్నికలు రావటం ప్రభుత్వం మారటం జరిగింది. నూతన ప్రభుత్వం వచ్చిన తరువాత ఇక్కడ పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. దీంతో సుందరీకరణ, ప్రహరీ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ఈ ప్రాంతంలో పిచ్చి మొక్కలు పెరిగిపోవటంతో పాటు చెత్తచెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా మారాయి.

విషసర్పాల సంచారం..

బుడమేరు పక్కన పిచ్చి మొక్కలు, చెత్తచెదారం పేరుకుపోవటం వల్ల విషసర్పాల సంచారం అధికమైందని స్థానికులు వాపోతున్నారు. కనీసం ప్రహరీ నిర్మించినా విషసర్పాల నుంచి రక్షణ కలిగేదని అంటున్నారు. అందరూ ఇక్కడ చెత్తచెదారం వేయటం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లటంతో పాటు దోమలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు వాహనాల పార్కింగ్

ఇక్కడ ప్రహరీ లేకపోవటం వల్ల ప్రైవేటు వాహనాలు పార్కింగ్ చేసుకుంటున్నారు. ప్రహరీ త్వరితగతిన పూర్తిచేయని పక్షంలో మారోమారు ఇక్కడ ఆక్రమణలు జరిగే అవకాశముందని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి తక్షణమే సుందరీకరణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేయాలి

దేవీనగర్‌లో కనీసం ఒక్క ఉద్యానవనం కూడా లేదని, ఈ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని తద్వారా ఈ ప్రాంతం పరిశుభ్రంగా ఉండటంతో పాటు ఆక్రమణలకు గురయ్యే అవకాశం ఉండదని స్థానికులు చెబుతున్నారు.

ఘనంగా విష్ణు కుమార్తె వివాహ వేడుక





నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, జోగి రమేష్, జగన్‌మోహనరావు, సజ్జల రామకృష్ణారెడ్డి, రుహుల్లా తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, కిరణ్మయి దంపతుల కుమార్తె లక్ష్మీ చంద్రిక, వేంకట సుబ్రహ్మణ్య సాయికిరణ్‌ల వివాహ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకకు హాజరైన వారిలో రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, కేశినేని నాని, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, ఎండీ రుహుల్లా, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ మంత్రులు పేర్ని నాని, అంబటి రాంబాబు, జోగి రమేష్, మాజీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, స్వామిదాసు, మొండితోక జగన్‌మోహనరావు, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజారెడ్డి తదితరులు ఉన్నారు.

28న ఎంబీవీకేలో భూ సమస్యలపై సదస్సు



రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐకేఎంఎస్ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భూ సమస్యలపై అఖిల భారత రైతు–కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో ఈనెల 28న విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి.ప్రకాష్, యు.గనిరాజు తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సదస్సు వాల్ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే మూడు నల్ల చట్టాలను తెచ్చిందని చెప్పారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించడంతో వెనక్కు తగ్గిందని, మరలా వాటినే దొడ్డిదారిన తెచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. డిజిటల్ అగ్రి మిషన్, నూతన వ్యవసాయక విధానాల పేరుతో ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టడానికి చూస్తోందని చెప్పారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు, పంటల కనీస మద్దతు ధర చట్టం వంటి వాటి ఊసే లేదన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఎనిమిది నెలలు గడిచినా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందలేదన్నారు. మిర్చి ధరలు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. క్వింటా మిర్చికి రూ.25 వేలు ధర నిర్ణయించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు ఎన్.పోతురాజు, రెడ్డి శ్రీను, నాని, అరుణోదయ శ్రీను, ఐఎఫ్‌టీయూ నాయకులు మీరావలి, జి.శంకర్, శ్రీను, పీఓడబ్ల్యూ నగర అధ్యక్షులు ఆసియా బేగం పాల్గొన్నారు.

రేపు ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి అండర్–14 బాల, బాలికల ఫెన్సింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లను ఈ నెల 25న కంచికచర్ల మండలం పొన్నవరంలోని ఏకత్యా పబ్లిక్ స్కూల్‌లో ఎంపిక చేస్తున్నట్లు కృష్ణాజిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.చెంబుబాబు, ఎన్.సతీష్‌బాబు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ, ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్ఏఐ) పత్రంతో మధ్యాహ్నం రెండు గంటల లోపు ఎంపిక ప్రాంగణంలో సంప్రదించాలని, మరిన్నివివరాలకు 95535 28888ను సంప్రదించాలని సూచించారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు మార్చి 1, 2 తేదీల్లో కంచికచర్ల మండలం పొన్నవరంలోని ఏకత్యా పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

బడుగులకు అండగా ఆర్‌పీఐ

నేషనల్ సెక్రటరీ పేరం శివ నాగేశ్వరావు గౌడ్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బడుగు, బలహీనవర్గాలకు తమ పార్టీ అండగా ఉంటుందని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావు గౌడ్ అన్నారు. ఆదివారం విజయవాడలోని ఐలాపురం రామా ఫంక్షన్ హాల్లో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా(అథవాలే) రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. అనంతరం పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన రామిశెట్టి రమేష్‌కు నియామకపత్రం అందజేశారు.

గ్రూప్ - 2 పరీక్ష కేంద్రాల పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు గ్రూప్ – 2 పరీక్ష కేంద్రాలను పటమట సీఐ వి.పవన్ కిశోర్ పరిశీలించారు. ఆదివారం జరిగిన ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశామని ఆయన తెలిపారు. గ్రూప్–2 పరీక్ష కేంద్రానికి సమీపంలోని దుకాణాలు, నెట్ సెంటర్లను మూసి వేయించి, కట్టుదిట్టమైన బందోబస్త్ ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నామని సీఐ చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): పాతపాడు రోడ్డులోని పంట కాల్వ వద్ద ఆటో డ్రైవర్ షేక్ చాంద్ బాషా(40) ఆదివారం మృతి చెందినట్లు వచ్చిన ఫిర్యాదుపై నున్న పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు, అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన షేక్ చాంద్‌బాషా అద్దె ఆటో నడుపుతుంటాడు. అతని భార్య అన్నపూర్ణ అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తోంది. వారికి ముగ్గురు సంతానం. మద్యం అలవాటున్న చాంద్‌బాషా ఈ నెల 21వ తేదీన మద్యం సేవించి అతని తల్లిదండ్రులు ఉంటున్న కండ్రికకు వెళ్లాడు. మద్యం మత్తులో పాతపాడు గ్రామం పంట కాల్వ వద్ద పడి మరణించినట్లు మృతుడి భార్య అన్నపూర్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మధురానగర్(విజయవాడసెంట్రల్): వాణీ స్కూల్ పదో తరగతి 1998 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకుని సందడి చేశారు. 27 సంవత్సరాల తరువాత కలుసుకున్న స్నేహితులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తరగతి గదుల్లో వారు కూర్చుని చదువుకున్న క్షణాలు, పాఠాలు బోధించిన ఉపాధ్యాయుల గురించి మాట్లాడుతూ ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయులను అనుకరిస్తూ పాఠాలు చెబుతూ చిన్ననాటి వలే అల్లరి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించి తీర్చిదిద్దిన పాఠశాల డైరెక్టర్ అంజూరు శేషుబాబు, ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీలక్ష్మి, ఉపాధ్యాయులను సత్కరించారు. మధు, సుశీల మాట్లాడుతూ.. తాము గత రెండేళ్ల క్రితం వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశామన్నారు. తమ బ్యాచ్ విద్యార్థుల వివరాలు సేకరించి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించామని తెలిపారు. వివిధ హోదాలు, వ్యాపారాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు పాల్గొని ఉత్సాహంగా గడిపారు.

రంగస్థల నటుడు బాబేలు రాజుకు ఘన నివాళి

గుణదల(విజయవాడ తూర్పు): కళామతల్లి ముద్దుబిడ్డగా ప్రముఖ రంగస్థల నటుడు మేడేపల్లి బాబేలు రాజు విశిష్టమైన వ్యక్తిగా గుర్తింపు సాధించారని వైఎస్సార్ సీపీ క్రైస్తవ మైనార్టీ విభాగం అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. రామవరప్పాడు రింగ్ సమీపంలోని ఓ హోటల్‌లో రాజు సంస్మరణ సభ ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, కళాకారులు దివంగతులైనా ప్రజల గుండెల్లో సజీవంగానే ఉంటారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో హరిశ్చంద్ర ఏకపాత్రాభినయం నాటకాన్ని ప్రదర్శించడంలో రాజు ప్రత్యేకతను సాధించారన్నారు. సీఎస్ఐ చర్చి ఫాదర్ జోజి క్రీస్తురాజు, ఏపీ ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ భాగ్యరాజు, మనోహర్, దేవదాస్, బండి జీవా తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే నేరాల నియంత్రణ

ఏడీసీపీ రామకృష్ణ



మాట్లాడుతున్న ఏడీసీపీ రామకృష్ణ, ఏసీపీ స్రవంతిరాయ్, సీఐ వెంకటేశ్వర్లు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అప్రమత్తతతోనే నేరాలను నియంత్రగలమని.. అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని ఏడీసీపీ గున్నం రామకృష్ణ సూచించారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లోని కాలనీ వాసులతో ఆదివారం పోలీసులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏడీసీపీ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో అవగాహన లేమి కారణంగానే నేరాలు చోటుచేసుకుంటున్నాయని.. మన చుట్టూ జరుగుతున్న సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా వేసవి కాలంలో చోరీలు, నేరాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని ఇంటికి తాళాలు వేయకుండా ఆరుబయట కానీ.. దాబాల పైన కానీ నిద్రపోవడం వల్ల దొంగతనాలు జరుగుతాయన్నారు. అలానే టూర్‌లకు.. ఊర్లకు వెళ్లేవారు తాము ఇంటిలో ఉండని రోజుల వివరాలను పోలీసులకు తెలిపితే పోలీసులు ఆయా నివాసాల వద్ద ప్రత్యేక బీట్లు ఏర్పాటుచేసి చోరీలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటారని సూచించారు. ఏసీపీ కె.స్రవంతిరాయ్ మాట్లాడుతూ కాలనీలు, అపార్ట్‌మెంట్‌ల వాసులు రక్షణ చర్యలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలనీల ద్వారాల వద్ద.. అపార్ట్‌మెంట్‌ల గేట్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటుచేయడం.. సెక్యూరిటీని ఎప్పటికప్పుడు పరిశీలించుకోవడం చేసుకోవడం ద్వారా నేరాలను చాలా వరకు తగ్గించవచ్చని చెప్పారు. సింగ్‌నగర్ సీఐ బీహెచ్ వెంకటేశ్వర్లు, స్టేషన్ ఎస్సైలు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు అన్ని హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ పార్టీల విలీన సభ తీర్మానించింది. అలాగే భారత విప్లవోద్యమ యోధులు చంద్ర పుల్లారెడ్డి, పైలా వాసుదేవ రావు, మాదాల నారాయణస్వామి, రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న)ల వర్ధంతి సభలను ప్రత్యేకంగా నిర్వహించాలని, దండకారుణ్యంలో కగార్ ఆపరేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న మారణకాండను నిలిపివేయాలని పలు తీర్మానాలు చేసింది. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ పార్టీల విలీన సభ ఆదివారం జరిగింది. సభలో రెండు పార్టీల రాష్ట్ర కమిటీలను విలీనం చేశారు. తొలుత భారత విప్లవోద్యమ అమరవీరులకు జోహార్లు అర్పించి, ఎర్రజెండా ఆవిష్కరణ చేశారు. ఈ సభలో న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు సాధినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ సాధన లక్ష్యంగా గల విప్లవ పార్టీలను విలీనం చేయడానికి కృషి జరుగుతోందన్నారు. ఈ కృషిలో ఐక్య న్యూడెమోక్రసీ పార్టీ అగ్రభాగాన నిలుస్తోందన్నారు. ఇందులో భాగంగానే గతేడాది నవంబర్‌లో న్యూడెమోక్రసీ పార్టీల కేంద్ర స్థాయిలో విలీనం అయ్యాయని చెప్పారు.

పార్టీల విలీనం శుభసూచకం..

దేశంలోని బీజేపీ – ఆరెస్సెస్ మనువాద ప్రభుత్వం ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, రక్షణలను రద్దుచేసి అటవీ, ఖనిజ సంపద కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కుట్రలు సాగిస్తోందని విమర్శించారు. మధ్య భారతంలో సాగుతున్న మారణకాండ దీనిలో భాగమేనని చెప్పారు.

దేశాన్ని జాతి, మత, కుల ప్రాతిపదిక మీద చీల్చి దాడులకు, మారణకాండలకు పురిగొల్పుతున్న మనువాద ఫాసిజాన్ని ఎదుర్కొని ఓడించాలంటే విప్లవకారుల ఐక్యత అవసరమన్నారు. ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విప్లవకారుల ఐక్యతను సాధించే లక్ష్యంతో రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీనం వెనుక కృషిని వివరించారు. జె.వి. చలపతిరావు మాట్లాడుతూ సైద్ధాంతికంగా, రాజకీయ విభేదాలతో పార్టీ రెండు సార్లు చీలిపోయిందని, ఇప్పుడు విలీనం కావడం శుభసూచకమన్నారు. సభలో సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.విష్ణు, కె.పొలారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వేలతో సచివాలయ సిబ్బంది ఇబ్బందులు

సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అర్లయ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వ వరుస సర్వేలతో గ్రామ/వార్డ్ సచివాలయాల సిబ్బంది సతమతమవుతూ అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోందని సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల అర్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో వలంటీర్లకు ఇచ్చినట్టే ప్రభుత్వమే సచివాలయాల ఉద్యోగులకు మొబైల్ ఫోన్లు ఇవ్వాలని, తద్వారా సర్వేలు చేస్తే డేటా భద్రంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఉన్న విధానం ద్వారా ఒకేసారి పలు సర్వేలు చేయాలంటూ ఉద్యోగులపై ఒత్తిడి తీసుకువాడం సరి కాదన్నారు. ఇటీవల కాలంలో డేటా చోరీలు, సైబర్ నేరాలు జరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రభుత్వమే ఫోన్, సిమ్ కార్డ్ అందించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పరిపాలన సంస్కరణల్లో భాగంగా వివిధ సర్వేలకు సచివాలయ ఉద్యోగులను ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. అందుకు వారు వ్యతిరేకం కాకపోయినా ఎటువంటి శిక్షణ తరగతులు నిర్వహించకుండా పై అధికారుల ఆదేశాల మేరకు ఏక కాలంలో అన్ని సర్వేలు పూర్తి చేయాలనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఉద్యోగుల వ్యక్తిగత ఫోన్లతో ప్రభుత్వ సర్వేలు, యాప్స్ ఇన్‌స్టాలేషన్‌తో వారి వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లుతుందని పేర్కొన్నారు.

శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఏపీటీడీసీ బస్



భవానీపురం(విజయవాడ పశ్చిమ): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) రాజమండ్రి నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి 18 సీట్ల ఏసీ మినీ బస్‌ను ఏర్పాటు చేసింది. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 6 గంటలకు రాజమహేంద్రవరం నుంచి బయలుదేరి రాత్రి 9 గంటలకు విజయవాడ భవానీపురంలోని హరిత బెరంపార్క్ వద్ద ఆగుతుంది. తిరిగి 10 గంటలకు బయలుదేరి 26వ తేదీ ఉదయం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి చేరుకుంటుంది. అక్కడ ఏపీటీడీసీ హోటల్ వద్ద ఆపుతారు. తరువాత టిఫిన్, భోజన సదుపాయం ఏర్పాటు చేసింది. అనంతరం శ్రీశైలంలో మల్లన్న స్వామి దర్శనం అయిన తరువాత బస్ బయలుదేరి త్రిపురాంతకం మీదుగా 27వ తేదీ తెల్లవారుజామున 2 గంటలకు విజయవాడ, సాయంత్రం 5 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటుంది. ఈ ప్రత్యేక టూర్ ప్రోగ్రామ్‌కు పెద్దలకు రూ.4,360, పిల్లలకు రూ.3,490 టికెట్ ధరగా నిర్ణయించినట్లు ఏపీటీడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (పీ) శేషగిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం 9848629341 (ఐఆర్ఓ, రాజమండ్రి), 9848007025 (సీఆర్ఓ, విజయవాడ) మొబైల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

● ఆసక్తిగా దాయాదుల పోరు





ఆదివారం జరిగిన ఇండియా, పాకిస్తాన్ మ్యాచ్‌తో ప్రజలు టీవీలకే పరిమితమయ్యారు. ఏలూరు రోడ్డులో ఓ ఎలక్ట్రికల్ దుకాణంలో దాయాదుల పోరును ఆసక్తిగా తిలకిస్తున్న యువతను, గవర్నర్‌పేటలో నిర్మానుష్యంగా ఉన్న దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ